

బస్సులకు జీపీఎస్
ఆర్టీసీ బస్సులలో జీపీఎస్ ట్రాకింగ్ సిస్టం ఏర్పాటు చేస్తున్నారు. దీనిద్వారా బస్సు ఎక్కడ ఉందో తెలుసుకోవచ్చు.
- 8లో ▸



ఆయిల్ పాం.. ఆర్థిక భారం
ఆయిల్ పాం మొక్కలకు తెగుళ్లు సోకుతున్నాయి. దీంతో రైతులు తెగుళ్ల నివారణకు పురుగుల మందులు పిచికారి చేస్తున్నారు.
- 9లో ▸

గరిష్టం/కనిష్టం
37.3 /12.3
వాతావరణం
ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరుగుతుంది. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

ధరణి టౌన్‌షిప్‌లో ప్లాట్లు, ఇళ్ల అమ్మకం

కామారెడ్డి అర్బన్: అడ్లూర్ శివారులోని ధరణి టౌన్‌షిప్‌లో అమ్ముడు కాని 132 ఓపెన్ ప్లాట్లు, వివిధ దశలలో నిలిచిపోయిన 121 ఇళ్లకు మరోసారి వేలం నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని తహసీల్దార్ జపాల వెంకటరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 16, 17, 18, 20, 21 తేదీల్లో వేలం నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్లాట్లు, ఇళ్ల వేలానికి సంబంధించి మార్చి 4, 10 తేదీల్లో ముందస్తు సమావేశాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఇతర వివరాలకు 99853 49485, 97003 43878 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

అథ్లెటిక్స్‌లో జిల్లాకు రెండు కాంస్య పతకాలు



వి.మల్లిక



ఎస్.శ్రీను

కామారెడ్డి అర్బన్: హన్మకొండలో శని, ఆదివారాల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి యూత్ చాంపియన్ షిప్ మీట్‌లో కామారెడ్డి జిల్లాకు రెండు కాంస్య పతకాలు దక్కాయి. అండర్–18 బాలికల విభాగంలో వి.మల్లిక (జావిలిన్ త్రో), బాలుర విభాగంలో ఎస్.శ్రీను (400 మీటర్ల పరుగు) క్యాంస పతకాలు సాధించారని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, కార్యదర్శి అనిల్‌కుమార్ తెలిపారు. మల్లిక, శ్రీనులను అసోసియేషన్ ప్రతినిధులు పలువురు ప్రశంసించారు.

సింగిల్ విండో చైర్మన్‌పై అవిశ్వాసం!

- క్యాంప్‌నకు తరలిన 9 మంది డైరెక్టర్‌లు

సదాశివనగర్: సదాశివనగర్ సింగిల్ విండో చైర్మన్ వరికెల కమలాకర్‌పై అవిశ్వాసానికి రంగం సిద్ధమవుతోంది. చైర్మన్ స్థానాన్ని ఆశిస్తున్న జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో మెజారిటీ డైరెక్టర్‌లు క్యాంప్‌నకు వెళ్లారు. మూడేళ్ల క్రితం సహకార సంఘం ఎన్నికలు జరిగాయి. డైరెక్టర్‌గా ఎన్నికైన ఏనుగు జనార్దన్ రెడ్డి చైర్మన్ పదవిని ఆశించారు. అయితే ఆయనకు అవకాశం దక్కలేదు. గతనెల 15వ తేదీకి పదవీకాలం మూడేళ్లు పూర్తి కావడంతో చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టడానికి ఆయన సిద్ధమయ్యారు. జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో విండో వైస్ చైర్మన్ సామల సంగవ్వ, డైరెక్టర్‌లు గాదారి బాల్‌రెడ్డి, గాదారి నర్సారెడ్డి, కొప్పుల సృజన్‌కుమార్, మార వెంకట్‌రెడ్డి, నారెడ్డి మధుసూదన్‌రెడ్డి, బాదావత్ నారాయణ, ఎర్రోల్ల రాజయ్య శిబిరానికి తరలివెళ్లారు.


'మహిళలపై హింసకు వ్యతిరేకంగా పోరాడాలి'



కామారెడ్డి టౌన్: రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా పోరాటాలు చేయాలని ఐద్వా రాష్ట్ర సహ కార్యదర్శి సబ్బని లత పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సంస్థ కార్యాలయంలో ఐద్వా జిల్లా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. మహిళల రక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐద్వా ప్రతినిధులు సుజాత, అనసూయ, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కార్యవర్గం..
ఐద్వా జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా ఎడ్ల శ్రీలత, కార్యదర్శిగా రాజారాం సావిత్రి, ఉపాధ్యక్షులుగా మంజుల, సహాయ కార్యదర్శిగా స్వప్న, ధనేశ్వరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ప్రశాంతంగా డీఏవో పరీక్ష



నిజామాబాద్అర్బన్ : టీఎస్‌పీఎస్సీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన డీఏవో పరీక్ష ప్రశాంతంగా జరిగింది. జిల్లా కేంద్రంలో మొత్తం 20 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 6,512 మంది పరీక్షకు దరఖాస్తు చేసుకోగా పేపర్–1కు 1897 మంది గైర్హాజరు కాగా, మధ్యాహ్నం జరిగిన పేపర్–2కు 1947 మంది గైర్హాజరు అయ్యారు.

మురిపిస్తున్న మక్క

- ఆశాజనకంగా మొక్కజొన్న పంట
- జిల్లాలో 35,753 ఎకరాల్లో సాగు



సాక్షి, కామారెడ్డి: యాసంగిలో మక్క పంట మురిపిస్తోంది. పంట ఏపుగా ఎదగడంతో కర్షకులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. పంటను కాపాడుకోవడానికి రాత్రింబవళ్లు శ్రమిస్తున్న రైతన్నలు.. మంచి దిగుబడులు వస్తాయని ఆశిస్తున్నారు.

జిల్లాలో వర్షకాలంలో భారీ వర్షాలు కురియడంతో సాగునీటి వనరులు పుష్కలంగా ఉన్నాయి. ప్రాజెక్టులు, చెరువులలో నీరుంది. భూగర్భజలాలూ అందుబాటులోనే ఉన్నాయి. సాధారణంగా జిల్లాలో సాగునీటి సౌకర్యం ఉన్నచోట రైతులు ఎక్కువగా వరి సాగు చేస్తారు. ఆ తర్వాత మక్క పంటకు ప్రాధాన్యతనిస్తున్నారు. ఈసారి యాసంగిలోనూ రైతులు వరి తర్వాత మక్కే ఎక్కువ విస్తీర్ణంలో వేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో 35,753 ఎకరాల్లో మక్క పంట సాగైంది. జిల్లాలోని సదాశివనగర్, భిక్కనూరు, గాంధారి, రాజంపేట, తాడ్వాయి, లింగంపేట, బిచ్కుంద, బాన్సువాడ, రామారెడ్డి, మాచారెడ్డి, బీబీపేట, దోమకొండ తదితర మండలాల్లో మక్క పంట ఎక్కువగా సాగవుతోంది. కొన్ని ప్రాంతాల్లో రైతులు డ్రిప్ సాయంతో నీరందిస్తున్నారు. మరికొన్ని చోట్ల కాలువల ద్వారా నీరు పారిస్తున్నారు. రాత్రింబవళ్లు పంటపై శ్రద్ధ కనబరుస్తున్న రైతులు.. పంట ఏపుగా పెరిగి ఆశాజనకంగా ఉండడంతో మరింతగా చెమటోడుస్తున్నారు. అడవి జంతువుల బారి నుంచి కాపాడుకునేందుకు పంట చేను వద్దే మకాం పెట్టి, కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు.

దిగుబడిపై ఆశలు..
మక్క పంట ఆశాజనకంగా ఉండడంతో ఈసారి దిగబడులు పెరుగుతాయని రైతులు ఆశతో ఉన్నారు. వానాకాలంకన్నా యాసంగిలో దిగుబడి ఎక్కువ రావచ్చని అంచనా వేస్తున్నారు. వానాకాలంలో పండించిన మక్కలకు మొదట్లో ధర లభించక ఇళ్లల్లోనే నిల్వ చేసుకున్న రైతులు.. ధర వచ్చిన తరువాత అమ్ముకున్నారు. ఈసారి మక్కల దిగుబడి పెరుగుతుందని భావిస్తున్నారు. మక్క పంటకు నీటి తడులు కిందామీద కాకుండా రైతులు జాగ్రత్తలు పడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో అడవి పందుల బెడద రైతులను కొంత ఇబ్బంది పెడుతోంది. అయితే అడవి పందుల సమస్యను అధిగమించడానికి రైతులు రకరకాల ప్రయత్నాలు చేస్తున్నారు. చేను వద్దే మంచె వేసుకుని రాత్రింబవళ్లు కాపలా కాస్తున్నారు. పందులు చేనులోకి చొరబడకుండా పలువురు రైతులు సోలార్ విద్యుత్ కంచెలు ఏర్పాటు చేసుకున్నారు. పందులను భయపెట్టేందుకు రకరకాల చప్పుళ్లు చేస్తున్నారు. దీంతో పందులు పంట చేనువైపు రావడం లేదు. మక్క పంట ఏపుగా పెరిగి, కంకి బలంగా వస్తుండడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

పదెకరాల్లో సాగు చేస్తున్న..



పది ఎకరాల్లో మక్క పంట వేసిన. నీటి సౌకర్యం ఉన్నందున పంట బాగానే ఉంది. దిగుబడులు కూడా ఎక్కువగా వస్తాయని ఆశిస్తున్నం. గిట్టుబాటు ధర లభిస్తే ఎంతో మేలు జరుగుతుంది. ఈసారి ధర బాగానే ఉంటుందని అనుకుంటున్నం. –ప్రభాకర్‌రెడ్డి, రైతు, శివాయిపల్లి, రాజంపేట మండలం

రాత్రింబవళ్లు కష్టపడుతున్నం



మొన్నటి వానాకాలంలో రెండెకరాల్లో మక్క పండించిన. ఎకరాకు 40 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఇతర పంటలకన్నా మక్కనే బాగుంది. యాసంగిలోనూ మక్క వేసిన. డ్రిప్ ద్వారా పంటకు నీటిని అందిస్తున్న. రాత్రింబవళ్లు కష్టపడుతున్నం. మద్దతు ధర దక్కితే లాభమే.
–నర్సారెడ్డి, రైతు, మర్కల్, సదాశివనగర్ మండలం

11,110 మొక్కలు అగ్గిపాలు

- నస్రుల్లాబాద్ అటవీ ప్రాంతంలో నిప్పు
- 25 ఎకరాల్లో హరితహారం మొక్కలు దగ్ధం
- రూ. లక్షల విలువైన మొక్కలు అగ్నికి ఆహుతి
- అటవీ శాఖ నిర్లక్ష్యంపై విమర్శలు



మొక్కల వివరాలను చూపే బోర్డు

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : నస్రుల్లాబాద్ అటవీ ప్రాంతంలో చెలరేగిన కార్చిచ్చుకు హరితహారంలో నాటిన మొక్కలు బుగ్గిపాలయ్యాయి. అటవీశాఖ సిబ్బంది నిర్లక్ష్యానికి ఇది ఉదాహరణగా నిలుస్తోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 2022–23లో హరితహారంలో భాగంగా నాటిన మొక్కలు అగ్నికి ఆహుతైన సంఘటన నస్రుల్లాబాద్ మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న అటవీ ప్రాంతంలో చోటు చేసుకుంది. హాజీపూర్ రిజర్వ్ ఫారెస్ట్‌లో 25 ఎకరాల్లో ఉన్న సుమారు 11,110 మొక్కలు అగ్నికి ఆహుతిగా మారాయి. లక్షలు వెచ్చించి నాటిన మొక్కలకు రక్షణ లేకుండా పోయింది. ఫారెస్ట్ అధికారులు ఫైర్‌లైన్ వేయిస్తున్నామంటూ ప్రగల్భాలు పలుకుతున్నా విధినిర్వహణలో నిర్లక్ష్యానికి నిలువెత్తు సాక్ష్యంగా ఈ ఘటనను పేర్కొనవచ్చు.

బాధ్యులు ఎవరు..?
వేల మొక్కలను లక్షలు ఖర్చు చేసినా అధికారులకు నిత్యం విధి నిర్వహణ కొనసాగిస్తుండాలి. ప్రతిరోజు ఘటనా స్థలానికి ఆనుకుని ఉన్న నర్సరీలో పనులు సాగిస్తుంటారు. ఓ అధికారులు నలుగురు కూలీలు నర్సరీలో ఉంటూ పనుల సాగిస్తున్నారు. కాని ఇంత జరిగినా కూడా ఉన్నతాధికారుల దృష్టికి రాకుండా స్థానిక సిబ్బంది జాగ్రత్తలు పడుతున్నారని పుకార్లు షికార్లు చేస్తున్నాయి. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన హరిత హారం కార్యక్రమం క్షేత్ర స్థాయి అధికారుల నిర్లక్ష్యం కారణంగా నీరుగారుతుందనడంలో అతిశయోక్తి లేదు. కేవలం ఓ మొక్కను మూగ జీవాలు మేస్తేనో, అడవిలో చెట్టు నరికితేనో సవాలక్ష నిబంధనలు చెప్పి కట్టెలు కొడ్తూ జీవనం సాగించుకునే వారిపై అటవీశాఖ సిబ్బంది తమ జులూం చూపిస్తారు. కాని 10 వేల మొక్కలు చిగురు దశలోనే అదీ జన సంచారం ఉండే ప్రదేశంలో బుగ్గిపాలైతే సిబ్బంది బాధ్యత మరిచి ప్రవర్తిస్తున్నారు.

ఫైర్‌లైన్స్ ప్రపోజల్స్ లేవు
అగ్ని ప్రమాదం జరిగిన 10 హెక్టార్ల ప్రదేశంలో ఫైర్ లైన్ ఏర్పాటు ప్రపోజల్స్ లేవు. కార్చిచ్చు అటవీ పైభాగం నుంచి వచ్చింది. దాన్ని ముందే గ్రహించాం కనుక ఆర్పగలిగాం. ఘటనాప్రదేశాన్ని సందర్శించి కారణాలతో నివేదికలు అందిస్తాం.
– సంతోష్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, బాన్సువాడ

మొక్కల వివరాలివి..
బాన్సువాడ రేంజ్ పరిధిలోని నస్రుల్లాబాద్ సెక్షన్‌లో ఉన్న కాంప్ట్ నెం 274/1లో ఉన్న రిజర్వ్ ఫారెస్ట్ హాజీపూర్‌లో 2022–23లో 10 హెక్టార్లలో లినియర్ ప్లాంటేషన్‌లో వేప, రావి, మర్రి, జామూన్, చింత, సీమ చింత, నెమలి నారా తదితర మొక్కలను నాటారు. వీటికి సుమారు రూ. 8 లక్షల వరకు అప్పటి రేంజ్ ఆఫీసర్ నాటించారన్న అధికారుల లెక్కలు చెబుతున్నాయి.

పూర్తిగా ఆరిపోని కార్చిచ్చు
10 వేల మొక్కలు పూర్తిగా కాలిపోయినా కూడా కార్చిచ్చు ఇంకా సాగుతూనే ఉంది. అడపాదడపా అధికారులు ఘటనాస్థలానికి వచ్చి మంటలు ఆర్పేసిన ఆనవాళ్లు ఉన్నా ఇంకా అగ్గి సాగుతూనే ఉంది. పైన చిత్రంలో చూస్తే అధికారులు తమ విధులను ఎంత సక్రమంగా సాగిస్తున్నారో చూడవచ్చు.



అగ్నిప్రమాదంలో కాలిపోయిన మొక్కలు

బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

నస్రుల్లాబాద్: బీర్కూర్ శివారులోని తెలంగాణ తిరుమల దేవస్థానంలో ఆదివారం బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. సాయంత్రం నిర్వహించిన అంకురార్పణ కార్యక్రమంలో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. ఉత్సవాలలో భాగంగా విష్ణు సహస్ర నామ పారాయణం, విశ్వక్సేన ఆరాధన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



విరాళాలు స్వీకరిస్తున్న కలెక్టర్ పాటిల్

ఆలయానికి విరాళాలు..
నస్రుల్లాబాద్: బీర్కూర్ శివారులోని తెలంగాణ తిరుమల దేవస్థానంలో శ్రీవారికి కిరీటానికి భక్తులు విరాళాలు సమర్పించారు. ఆలయ కమిటీ సభ్యుడు ద్రోణవల్లి అశోక్ 50 గ్రాముల బంగారం, దొడ్ల నీరజ వెంకటరమణ రూ.75 వేలు, శైలజ రాజాగౌడ్, చూకూరి వరణ్ సాయి, గంగిరెడ్డి పద్మ రాజేశ్వర్‌రెడ్డి, విష్ణుప్రియ, రవిశంకర్ తలా రూ. 57 వేలు అందించారని ఆలయ మేనేజర్ విఠల్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు శంభురెడ్డి, మద్దినేని నాగేశ్వరావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న స్పీకర్ కుటుంబ సభ్యులు

హెలీప్యాడ్ పరిశీలన



హెలీప్యాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ, డీసీసీబీ చైర్మన్

బాన్సువాడ టౌన్: వచ్చేనెల 1న బాన్సువాడకు సీఎం కేసీఆర్ రానున్న నేపథ్యంలో ఆదివారం బాన్సువాడలో హెలీప్యాడ్ స్థలాన్ని కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి పరిశీలించారు. బీర్కూర్ మండలం తిమ్మాపూర్‌లోని తెలంగాణ తిరుమల దేవస్థానం బ్రహ్మోత్సవాలలో సీఎం కేసీఆర్ పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో కలెక్టర్, ఎస్పీలు ఆదివారం ఆలయాన్ని సందర్శించారు. సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. బాన్సువాడ వెళ్లి హెలీప్యాడ్ స్థలాన్ని పరిశీలించారు. వారి వెంట ఆర్డీవో రాజాగౌడ్, డీఎస్పీ జగన్నాథ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్ తదితరులు ఉన్నారు.

'ఆర్య క్షత్రియుల సంక్షేమానికి కృషి'



మాట్లాడుతున్న నిట్టు వేణుగోపాల్‌రావు

కామారెడ్డి టౌన్: రాష్ట్రంలోని ఆర్య క్షత్రియుల సంక్షేమానికి కృషి చేస్తానని ఆర్య క్షత్రియ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నిట్టు వేణుగోపాల్‌రావు పేర్కొన్నారు. ఆర్య క్షత్రియ సంఘం జిల్లా ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లో సంఘం రాష్ట్ర భవన నిర్మాణం కోసం రూ. కోటి కేటాయించిన సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అనంతరం భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసుకుందామన్నారు. అన్ని జిల్లాల్లో సంఘం అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు నిట్టు వెంకట్‌రావు, నాయకులు పోలీస్ కృష్ణాజీరావు, నిట్టు కృష్ణ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం

- ఎల్లారెడ్డి మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్
- కుక్కలు, కోతుల బెడదపై సాక్షి ఫోన్ ఇన్
- వెల్లువెత్తిన ఫిర్యాదులు





ఎల్లారెడ్డి/ఎల్లారెడ్డి రూరల్ : ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలో కుక్కలు, కోతులు, పందులు, పారిశుధ్యం తదితర సమస్యలపై ఆదివారం 'సాక్షి' ఫోన్ ఇన్ కార్యక్రమాన్ని నిర్వహించింది. మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు ఫోన్ ద్వారా మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్‌తో మాట్లాడి, ఫిర్యాదులు చేశారు. ప్రజల ఫిర్యాదులకు మున్సిపల్ కమిషనర్ విని, సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

తార్ల సాయిప్రసాద్ : పట్టణంలోని 8వ వార్డు పరిధిలోని త్యార్ల ఆగమయ్య కాలనీలో పందులు, కోతుల బెడద ఎక్కువగా ఉంది.

జగ్జీవన్, మున్సిపల్ కమిషనర్ : వారం రోజుల క్రితం పందులను పట్టించాం. మరో వారంరోజుల్లో పందులను పట్టుకోవాలని నిర్వాహకులకు నోటీసులు ఇచ్చి వాటిని తరలించేందుకు చర్యలను తీసుకుంటాం. నెలరోజుల్లో కోతులను పట్టే చర్యలను తీసుకుంటాం. గతంలో రెండుమార్లు కోతులను పట్టించడం జరిగింది.

గాదె సత్తయ్య : రాత్రి పూట కుక్కలు అరుస్తూ నిద్ర లేకుండా చేస్తున్నాయి.

జగ్జీవన్ : కుక్కల నియంత్రణకు తగిన చర్యలను తీసుకుంటున్నాం. కుక్కలకు ఫ్యామిలి ప్లానింగ్ ఆపరేషన్లకు గాను వైద్యాధికారుల బృందాన్ని ఏర్పాటు చేస్తున్నాం. కుక్కల బెడద తగ్గేందుకు మున్సిపల్ పాలకవర్గంతో చర్చించి తగిన నివారణ చర్యలను తీసుకుంటాం.

మర్లు సాయిబాబా: ఇందిరానగర్ కాలనీలో కోతులు, పందుల బెడద అధికంగా ఉంది

జగ్జీవన్ : కోతులను, పందులను గతంలో పట్టించాం. మళ్ళీ కోతులను, పందులను తరలించేందుకు తగిన చర్యలను తీసుకుంటాం.

కుశలకంటి మహేశ్ : 2వ వార్డులో దోమల బెడదతో చిన్నారులకు జ్వరాలు వస్తున్నాయి.

జగ్జీవన్ : దోమల నివారణకు కాలనీలలో ఫాగింగ్ మిషన్లు తిప్పుతున్నాం. మురికి కాలువలలో ఆయిల్ బాల్స్‌ను వేస్తున్నాం. దోమల నివారణకు మరిన్ని చర్యలను తీసుకుంటాం.

రామేశ్వర్‌రావు : కుక్కలకు కేర్ సెంటర్లు ఏర్పాటు చేయాలి

జగ్జీవన్ : కుక్కలకు కేర్ సెంటర్ల ఏర్పాటు కోసం ప్రభుత్వానికి నివేదించాం. త్వరలోనే ఎనిమల్ కేర్ సెంటర్లను ఏర్పాటు చేస్తాం.

అనిల్ : బీసీ కాలనీలో మురికి నీరు వెళ్లేందుకు ఇబ్బందులున్నాయి.

జగ్జీవన్ : బీసీ కాలనీలో మురికి నీరు సక్రమంగా పోయేందుకు తగిన చర్యలను తీసుకుంటాం. మురికి కాలువలను శుభ్రం చేయిస్తాం.

కిరణ్ : 3వ వార్డులో కుక్కలు దాడులు చేస్తున్నాయి.

జగ్జీవన్ : కుక్కల సంరక్షణకు ఎనిమల్ కేర్ సెంటర్లు ఏర్పాటు చేస్తాం. వాటికి ఫ్యామిలి ప్లానింగ్ ఆపరేషన్లకు వైద్య బృందాన్ని ఏర్పాటు చేస్తాం

ఖదీర్ : లైబ్రరీ వెనకాల గల కాలనీలో మురికి నీరు ఇంట్లోకి వస్తున్నాయి.

జగ్జీవన్ : మురికి నీరు ఇంటిలోకి రాకుండా కొత్తగా డ్రెయినేజీ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం. త్వరలోనే కొత్త డ్రెయినేజీ నిర్మించి నీరు రాకుండా తగిన చర్యలను తీసుకుంటాం.

శ్యాం సుందర్ : గాంధీచౌక్‌లో కుక్కల గుంపుతో వెళ్లాలంటే భయంగా ఉంది.

జగ్జీవన్ : గాంధీచౌక్‌లో కుక్కల మంద ఎక్కువగా ఉన్నది వాస్తవమే. వాటికి కేర్ సెంటర్లు ఏర్పాటు చేసి చర్యలు తీసుకుంటాం.

వంశీ : బతుకమ్మ కుంటలో పట్టణానికి సంబంధించిన చెత్తను అక్కడే వేస్తున్నారు. దీంతో అక్కడి వాతావరణం పూర్తిగా కలుషితమవుతోంది.

జగ్జీవన్ : బతుకమ్మ కుంటలో చెత్తను వేయడం లేదు. 1406 సర్వే నెంబర్‌లో డంపింగ్ యార్డును నిర్మించాం. చెత్తను అక్కడే వేస్తున్నారు. త్వరలోనే అక్కడ కంపోస్టు షెడ్‌లో చెత్తను ఎరువుగా మార్చేందుకు తగిన చర్యలను తీసుకుంటున్నాం.

పాండ్రే వినోద్, ఎల్లారెడ్డి : కుక్కల గుంపులను చూసి చిన్నారులు బయటకు వెళ్లాలంటే జంకుతున్నారు.
జగ్జీవన్ : కుక్కలకు కేర్ సెంటర్ ఏర్పాటుకు తగిన చర్యలను తీసుకుంటున్నాం. కుక్కలకు ఫ్యామిలి ప్లానింగ్ ఆపరేషన్లు చేసేందుకు అధికారుల బృందాన్ని ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులకు తెలియజేశాం.

ముత్యాల సురేందర్, హౌసింగ్ బోర్డు కాలనీ : మనుషులపై, ఆవులపై కుక్కలు దాడి చేసి గాయపరుస్తున్నాయి. బయటికి రావాలంటేనే భయంగా ఉంది.
జగ్జీవన్ : కుక్కల సంఖ్యను తగ్గించేందుకు తగిన చర్యలను తీసుకుంటాం. వాటి కోసం ఎనిమల్ కేర్ సెంటర్లు, ఫ్యామిలి ప్లానింగ్ కోసం వైద్యుల బృందాన్ని ఏర్పాటు చేస్తాం

ఇబాదుల్లా, న్యూ ఆబాది : రాత్రి వేళలో కుక్కలు రోడ్లపై లేకుండా చూడాలి.
జగ్జీవన్ : కుక్కలకు సంబంధించి కేర్ సెంటర్ల ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకుంటాం.

పద్మ శ్రీకాంత్, కౌన్సిలర్ : కోతుల నివారణకు చర్యలు తీసుకోండి.
జగ్జీవన్ : కోతుల నివారణకు తగిన చర్యలను తీసుకుంటున్నాం. గతంలో మున్సిపల్ పాలకవర్గం అనుమతితో కోతులను రెండుమార్లు పట్టించాం. మళ్లీ కోతులను తరలించేందుకు మున్సిపల్ పాలకవర్గ అనుమతితో తగిన చర్యలు తీసుకుంటాం.

ఎజాజ్ అహ్మద్, ఎల్లారెడ్డి : డైలీ మార్కెట్‌లో మటన్ దుకాణాలు, చికెన్ దుకాణాలు ఎక్కువగా ఉన్నాయి. ఈ ప్రాంతంలో కుక్కలు వెంట పడి కరుస్తున్నాయి.
జగ్జీవన్ : డైలీ మార్కెట్‌లో మటన్ దుకాణాలు, చికెన్ దుకాణాలు ఎక్కువగా ఉండడంతో వారికి నోటీసులకు అందిస్తాం. మటన్, చికెన్ ముక్కలు రోడ్డుమీద వేయకుండా డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేస్తాం. చెత్తను తరలించే ఆటోలలో వేయాలని ఆదేశాలిస్తాం.

శ్రీకాంత్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు : కుక్కల భయంతో వాకింగ్‌కు వెళ్లాలంటేనే భయమేస్తోంది.
జగ్జీవన్ : కుక్కల గుంపులు ఎక్కువ కావడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. కుక్కల సంఖ్య పెరగకుండా వాటికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసేందుకు చర్యలను తీసుకుంటున్నాం.

కొండంభట్ల రాజేశ్వర శర్మ, ఎల్లారెడ్డి : సాయంత్రం అయి తే చాలు కుక్కలు వెంటపడి కరుస్తున్నాయి. గ్రామ శివారులో పౌల్ట్రీఫాంలు కారణంగా మాంసం తిని మనుషులపై దాడులు చేస్తున్నాయి.
జగ్జీవన్ : పౌల్ట్రీ ఫాం నిర్వాహకులకు నోటీసులను జారీ చేస్తాం. వారిపై తగిన చర్యలను తీసుకుంటాం.

క్లుప్తంగా

సర్పంచ్ భర్త వేధిస్తున్నాడని ఆత్మహత్యాయత్నం


ఆస్పత్రిలో స్వామి

కామారెడ్డి టౌన్: శాబ్దిపూర్ సర్పంచ్ భర్త పరశురాం వేధింపులు భరించలేక గ్రామానికి చెందిన నాయిని స్వామి శనివారం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించడంతో చికిత్స పొందుతున్నాడు. సర్పంచ్ ఇంటి ముందు ఉన్న చెట్టు విషయంలో అటవీ శాఖ అధికారులతో తన కొడుకుపై కేసు నమోదు చేయించాడని, భగీరథ పైప్‌లైన్ పగిలిపోయిందని జీపీ నుంచి నోటీసులు అందించాడని స్వామి తల్లి నర్సవ్వ పేర్కొంది. జరిమానా కూడా వేశారన్నారు. తరుచూ వేధిస్తూ.. భయబ్రాంతులకు గురి చేయడంతో తన కొడుకు మనస్తాపానికి గురై ఆత్మహత్యకు యత్నించాడని వాపోయింది. అధికారులు స్పందించి సర్పంచ్ భర్త పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

వృద్ధురాలిపై కుక్క దాడి

గాంధారి: మండలంలోని వండ్రికల్ గ్రామంలో ఆదివారం వృద్ధురాలిపై కుక్క దాడి చేసి గాయపర్చినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన సంపంగి ఎల్లవ్వను కుక్క కరిచింది. గ్రామస్తులు బాధితురాలిని 108లో కామారెడ్డికి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఒకరి అదృశ్యం

ధర్పల్లి: మండలంలోని రామడుగు గ్రామానికి చెందిన శిరం నడిపి గంగారాం ఈనెల 24న ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో గంగారాం భార్య సాయమ్మ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపారు.

సిరిపూర్‌లో గుడిసె దగ్ధం

మోపాల్: మోపాల్ మండలం సిరిపూర్ గ్రామంలో గుడిసె దగ్ధమైంది. గ్రామానికి చెందిన తెడ్డు లక్ష్మి, ఆమె కుమారుడు సాగర్ గుడిసెలో నివాసం ఉంటారు. ఆదివారం ఉదయం వారు ఇంట్లో లేని సమయంలో గుడిసెకు మంటలు అంటుకున్నాయి. సిలిండర్ మంటలే కారణమని భావిస్తున్నారు. స్థానికులు మంటలు ఆర్పే యత్నం చేశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో రూ1.20 లక్షల నగదు, ఇతర సామగ్రి కాలిపోయాయి. ఆర్ఐ రాజేశ్వర్ పంచనామా చేశారు. సుమారు రూ.రెండు లక్షల వరకు నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు.

ఆశీర్వదిస్తే అభివృద్ధి చేస్తా



నిజాంసాగర్: రానున్న ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తే నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార అన్నారు. ఆదివారం మండలంలోని బూర్గుల్, మాగి గ్రామాల్లో బీజేపీ స్ట్రీట్ కార్నర్ సమావేశాలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో తిరిగి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. కేసీఆర్ ఎన్నికల హామీలను గాలికి వదిలేశారన్నారు. రాములుసేట్, లక్ష్మణ్, రాజు, శ్రీనివాస్‌గౌడ్, మణేందర్, నరేశ్ ఉన్నారు.

బస్సులకు జీపీఎస్

- ట్రాకింగ్ సిస్టం ప్రవేశపెట్టిన ఆర్టీసీ
- గరుడ, రాజధాని, సూపర్ లగ్జరీల్లో సౌకర్యం
- బస్సు ఎక్కడుందో తెలుసుకునే వీలు



ఖలీల్‌వాడి: ఆర్టీసీ బస్సులు ఆధునికతను సంతరించుకోనున్నాయి. బస్సుల్లో జీపీఎస్ ట్రాకింగ్ సిస్టంను ప్రవేశపెట్టింది. దీని సాయంతో ప్రయాణ ప్రాంగణానికి చేరాల్సిన బస్సు ఎక్కడ వరకు వచ్చిందో తెలుసుకోవచ్చు. ఇందుకోసం బస్సుల్లో ప్రత్యేక డివైజ్‌లను ఏర్పాటు చేసి ట్రాకింగ్ సిస్టంను అందుబాటులోకి తీసుకువచ్చారు. అయితే ప్రస్తుతం గరుడ, రాజధాని, సూపర్ లగ్జరీ బస్సుల్లో ఈ సౌకర్యం అందుబాటులోకి వచ్చింది.

టీఎస్ ఆర్టీసీ యాప్ ద్వారా..

బస్టాండ్‌నుంచి బయలుదేరిన బస్సు ఎక్కడ ఉందో తెలుసుకునేందుకు ఆర్టీసీ జీపీఎస్ ట్రాకింగ్ సిస్టంను ప్రవేశపెట్టింది. దీని సాయంతో మనం ప్రయాణించాల్సిన రైలు ఎక్కడ ఉందో కొన్ని యాప్‌ల ద్వారా తెలుస్తున్నట్లుగానే ప్రయాణ ప్రాంగణానికి చేరాల్సిన బస్సు ఎక్కడ వరకు వచ్చిందో తెలుసుకోవచ్చు. టీఎస్ ఆర్టీసీ యాప్ ద్వారా ఈ సేవలను అందుబాటులోకి తెచ్చారు. ఇందుకోసం నిజామాబాద్ రీజియన్‌లోని గరుడ, రాజధాని, సూపర్‌లగ్జరీ బస్సులకు ప్రత్యేక పరికరాల(డివైజ్)ను అమర్చారు. వాటిని ఆన్‌లైన్ వ్యవస్థకు అనుసంధానం చేసే పనిలో ఉన్నారు. తొలుత ఐ–టీమ్ మెషిన్లు ఉన్న బస్సులకు ఈ డివైజ్‌ను ఏర్పాటు చేసి ట్రాకింగ్ సిస్టంను అందుబాటులోకి తీసుకువచ్చారు. వీటి తర్వాత ఎక్స్‌ప్రెస్, పల్లె వెలుగులకు ట్రాకింగ్ సిస్టం అందుబాటులోకి తీసుకొచ్చే అవకాశం ఉంది. టిక్కెట్ రిజర్వేషన్ చేసుకున్న వెంటనే ప్రయాణికుడి స్మార్ట్‌ఫోన్‌కు ఒక లింకు వస్తుంది. బస్సు సర్వీస్ నంబర్లు నమోదు చేసి క్లిక్ చేస్తే ట్రాకింగ్ లోడ్ చేసుకోవాలి. దీంతో బస్సు ఎప్పుడు ఎక్కడ ఉందో ఏ టైంకు వస్తుందో స్పష్టంగా తెలుస్తుంది.

ఉమ్మడి జిల్లాలోని బస్సుల వివరాలు

బస్సు	గరుడ	రాజధాని	సూపర్‌లగ్జరీ
సంఖ్య	8	22	40

ప్రయాణికులకు నాణ్యమైన సేవలు

ప్రయాణికులకు నాణ్యమైన సేవలు అందిస్తాం. ప్రయాణికులు బస్సు ఎక్కడ ఉందో టీఎస్ ఆర్టీసీ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. గతంలో బస్సు ఎక్కడ ఉందని డ్రైవర్లను ఫోన్ల ద్వారా తెలుసుకునేవారు. ప్రయాణికులకు ఈ యాప్ ద్వారా సౌకర్యవంతంగా ఉంటుంది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో గరుడ, రాజధాని, సూపర్ లగ్జరీ బస్సులకు ఏర్పాటు చేశాం. ప్రస్తుతం వచ్చిన కొత్త బస్సులకు కూడా డీవైజ్‌లను ఇన్‌స్టాలేషన్ చేస్తాం.

– ఉషాదేవి, ఆర్ఎం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా

ప్రశాంతంగా సైనిక పాఠశాల ప్రవేశ పరీక్ష


ధర్మారం(బి) కళాశాల పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్‌సీవో మేరి ఏసుపాదం


భిక్కనూరులో..

డిచ్‌పల్లి: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా రుక్మాపూర్‌లో కొనసాగుతున్న సైనిక గురుకుల పాఠశాల (బాలురు)లో ఆరో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం (ఎంపీసీ) లో ప్రవేశం కోసం ఆదివారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు సంస్థ నిజామాబాద్ జిల్లా కో–ఆర్డినేటర్ బి సంగీత తెలిపారు. నిజామాబాద్ ఆర్సీవో పరిధిలో డిచ్‌పల్లి మండలం ధర్మారం(బి), భిక్కనూర్ (కామారెడ్డి జిల్లా), జామ్ (నిర్మల్ జిల్లా)లోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల / కళాశాలలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో 90 శాతం మంది అభ్యర్థులు పరీక్షకు హాజరైనట్లు ఆమె తెలిపారు. ధర్మారం(బి) పరీక్షా కేంద్రాన్ని ఆర్సీవో మేరి ఏసుపాదం తనిఖీ చేశారు. ధర్మారం(బి) కళాశాల పరీక్షా కేంద్రంలో 254 మందికి 219 మంది హాజరు కాగా 35 మంది గైర్హాజరైనట్లు సంగీత తెలిపారు.

భిక్కనూరులో..

భిక్కనూరు: భిక్కనూరు సమీపంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో నిర్వహించిన సాంఘిక సంక్షేమ సైనిక పాఠశాల ప్రవేశ పరీక్షకు 31 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం పరీక్షకు 246 మంది దరఖాస్తు చేసుకోగా 215 మంది పరీక్ష రాశారని ప్రిన్సిపాల్ నర్సింహారెడ్డి తెలిపారు. పరీక్ష కేంద్రాన్ని ఆర్‌సీవో మేరి ఏసుపాదం తనిఖీ చేశారు. నోడల్ అధికారిగా ఎస్. మోహన్‌రెడ్డి వ్యవహరించారు.

కంఠేశ్వర్ ఆలయానికి గులాబీ ఫ్లెక్సీ

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: నీతులు ఎదుటివారికి చెప్పేటందుకే.. తమకు వర్తించవనేలా ఉంది గులాబీ పార్టీ నాయకుల తీరు. ఇందుకు నిదర్శనంగా నిజామాబాద్ నగరంలోని శ్రీ నీలకంఠేశ్వరాలయం గోడకు అధికార పార్టీ ఎమ్మెల్యే గణేశ్ గుప్తా, ఎమ్మెల్సీ కవిత, ఆలయ కమిటీ చైర్మన్ బిల్ల మహేష్, ఇతర నాయకుల ఫొటోలతో భారీ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. అయితే ఇక్కడ విషయమేమిటంటే దేవాలయం పరిసర ప్రాంతాల్లో ఎలాంటి ఫ్లెక్సీలు పెట్టకూడదంటూ.. ఆలయ చైర్మన్, కార్య నిర్వహణాధికారి పేరిట గమనిక బోర్డు ఏర్పాటు చేసి ఉంది. ఆ బోర్డు పక్కనే భారీ ఫ్లెక్సీ పెట్టడం గమనార్హం. రథసప్తమి రోజు పెట్టిన ఈ ఫ్లెక్సీని ఇప్పటివరకు తొలగించకుండా అలాగే ఉంచారు.


ఆలయం గోడకు పెట్టిన ఫ్లెక్సీ..
పక్కనే ఫ్లెక్సీలు పెట్టవద్దంటూ రాసిన హెచ్చరిక

ఆధ్యాత్మిక వాతావరణం ఉండే ప్రాంతాల్లో సైతం ఇలా రాజకీయ పార్టీ ఫ్లెక్సీ ఏర్పాటుపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

దేశంలో, రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక ప్రభుత్వాలు

- ఆప్ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు దిడ్డి సుధాకర్

కామారెడ్డిటౌన్: దేశంలో, రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక ప్రభుత్వాలు కొనసాగుతున్నాయని, ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేశాయని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు దిడ్డి సుధాకర్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో పార్టీ జిల్లా కార్యకర్తల ముఖ్య సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో ఏడెనిమిది నెలల్లో ఎన్నికలు రాబోతున్నందున ఎన్నికలకు ఆమ్ ఆద్మీ పార్టీ సన్నద్ధం అవుతుందన్నారు. ఢిల్లీ ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులపై బీజేపీ కక్ష పూరితంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. మనీష్ సిసోడియాను అవినీతి, లిక్కర్ స్కామ్ పేరుతో విచారణ చేస్తూ అరెస్టు చేయాలని ప్రయత్నిస్తుందన్నారు. అసలు లిక్కర్ స్కామ్ అంటేనే ఎవరికి తెలియదన్నారు. బీజేపీ సీబీఐ, ఈడీ, ఐటీ దాడులతో ప్రతిపక్షాలను బెదిరిస్తుందని ఆరోపించారు. అప్పులు లేకుండా ప్రజలు కట్టే పన్నులతోనే పాలన చేస్తున్న ప్రభుత్వం తమ ప్రభుత్వమే అన్నారు. ఇదే విధానాన్ని దేశమంతా విస్తరించాలన్నదే ఆప్ లక్ష్యమన్నారు. కేజ్రీవాల్‌ను ప్రధానిగా చేయడానికి అన్ని పార్టీలను ఏకం చేయడానికి ప్రయత్నిస్తున్నామన్నారు. కేంద్రంలో బీజేపి,రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీలు రెండు తమకు శత్రువులే అన్నారు. బీజేపీని గద్దె దించడానికి బీఆర్ఎస్ సహా అన్ని పార్టీలను కలుపుకుపోతామన్నారు. ఆప్ రాష్ట్ర నాయకురాలు ఇందిరా శోభన్ వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేశారన్నారు. రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు రామాగౌడ్, మదన్‌లాల్ రవి, అహ్మద్, రహమాన్, గఫర్ తదితరులున్నారు.


మాట్లాడుతున్న ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు సుధాకర్

అ‘పూర్వ’ సమ్మేళనం

కామారెడ్డి టౌన్: కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 1993–96 వరకు చదివిన డిగ్రీ బీకాం పూర్వ విద్యార్థులు జిల్లా కేంద్రంలోని బాబాగౌడ్ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. గత జ్ఞాపకాలను నెమరవేస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కిష్టయ్య హాజరయ్యారు. రిటైర్డ్ లెక్చరర్లు రాఘవరెడ్డి, విశ్వనాథ్‌రావు, పూర్వ విద్యార్థులు భూంరెడ్డి, శ్రీనివాస్ తదితరులున్నారు.


గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

బాల్కొండ: ముప్కాల్‌లో 1977–78 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదవిన విద్యార్థులు ఆదివారం మండల కేంద్రంలో సమేళ్నం నిర్వహించారు. తమకు విద్యాబుద్ధులు చెప్పిన గురువులకు సన్మానించారు.


కామారెడ్డిలో కలిసిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థులు


ఎల్లారెడ్డిలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన పూర్వ విద్యార్థులు

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి పట్టణంలోని ముత్యపు రాఘవులు ఫంక్షన్ హాల్‌లో ఆదివారం బాల్య మిత్రుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఎల్లారెడ్డి ఉన్నత పాఠశాల 1984–85 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఒక చోట కలుసుకొని ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో నునుగొండ శ్రీనివాస్, ఉక్కల్‌కర్ శ్రీనివాస్, బాల్‌రాజ్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

11 బ్యాచ్‌ల పూర్వ విద్యార్థులు

నందిపేట్: మండలంలోని కుద్వాన్‌పూర్ ప్రభుత్వ పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థులు సందడి చేశారు. 1976–77 నుంచి 1986–87 వరకు 11 బ్యాచుల పదో తరగతి విద్యార్థులు ఒకే వేదికపై కలిశారు. సుమారు 200 మంది విద్యార్థులు కలిసిన సమ్మేళనంలో గురువులను గౌరవంగా సన్మానించారు. తాము చదువుకున్న పాఠశాలను బాగు చేయడానికి తమ వంతు సహాయంగా ప్రతి ఒక్కరు చేయూతనందించారు.



అందరూ కలసిమెలసి ఉండాలి


సమావేశానికి హాజరైన గ్రామస్తులు, గౌడ కులస్తులు

జక్రాన్‌పల్లి: మండల కేంద్రంలో గ్రామస్తులు, గౌడ కులస్తులు కలసి మెలసి ఉండాలని డిచ్‌పల్లి సీఐ మోహన్ సూచించారు. ఆదివారం జక్రాన్‌పల్లి మండల పరిషత్తు కార్యాలయం సమావేశపు హాలులో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, గౌడ కులస్తులతో సీఐ, తహసీల్దార్ మల్లేశ్, ఎస్సై శ్రీకాంత్‌లు సమావేశం నిర్వహించారు. గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు గౌడ కులస్తులను కొంతకాలంగా సాంఘిక బహిష్కరణ చేశారని, ఈ విషయంలో గతంలో ఏసీపీ ఆధ్వర్యంలో ఇరువురితో చర్చించి సమస్యను పరిష్కరించామని ఎస్సై తెలిపారు. కానీ బహిష్కరణ కొనసాగుతుందన్న గౌడ కులస్తుల ఫిర్యాదుతో మరోసారి ఇరువురిని సమావేశ పరిచి బహిష్కరణ విధించవద్దని సూచించామన్నారు. వీడీసీ సభ్యులు ఎవరికి నిర్బంధాలు పెట్టకూడదని తెలిపారు. ఇరువురు కలసి మెలసి ఉండి, సహకరించుకుంటూ గ్రామాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. సమావేశంలో జక్రాన్‌పల్లి ఉపసర్పంచ్ జక్కం బాల్‌కిషన్, ఎంపీటీసీ సభ్యులు గడ్డం గంగారెడ్డి, తలారి మరియా సతీష్ పాల్గొన్నారు.


జక్రాన్‌పల్లిలో మాట్లాడుతున్న సీఐ మోహన్

రాయ్‌పూర్ ప్లీనరీ నుంచి జిల్లాకు కాంగ్రెస్ నేతలు

- ఇక నిరంతరం క్షేత్రస్థాయిలో..
- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్


రాయ్‌పూర్‌లో ప్లీనరీ వద్ద జిల్లా కాంగ్రెస్ నేతలు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో జాతీయ కాంగ్రెస్ ప్లీనరీ ఆదివారం ముగియడంతో పార్టీ జిల్లా నేతలు తిరుగు పయనమయ్యారు. మూడు రోజులుగా నిర్వహించిన ప్లీనరీలో జిల్లాకు చెందిన టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్, మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్‌బిన్ హందాన్, ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్, డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, రాష్ట్ర కిసాన్‌ఖేత్ అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు బాడ్సి శేఖర్‌గౌడ్, కిక్ గంగారెడ్డి, బాలరాజు, గంగాశంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్ ‘సాక్షి’తో ఫోన్‌లో మాట్లాడారు. దేశ సమగ్రత, సమైక్యత కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని రాహుల్‌గాంధీ భారత్ జోడోయాత్ర విజయవంతంతో మరోసారి నిరూపణ అయిందన్నారు. కార్యకర్తలు సైతం ఈ దిశగా క్షేత్రస్థాయిలో తిరిగి ప్రజలకు తెలపాలన్నారు. ఇందులో భాగంగా బూత్‌స్థాయిలో పార్టీ పటిష్టత కోసం కార్యకర్తలు మరింత కృషి చేయాలన్నారు. కాగా మండలస్థాయి నుంచి జాతీయస్థాయి వరకు పార్టీ కమిటీల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు 50 శాతం అవకాశాలు కల్పించేందుకు జాతీయ నాయకత్వం నిర్ణయించిందన్నారు. అదేవిధంగా 50 ఏళ్లలోపు వారికి పదవుల్లో మరిన్ని అవకాశాలు కల్పించనున్నట్లు పార్టీ ప్రకటించిందన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో, కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలే వస్తాయన్నారు.

క్రైం కార్నర్

కుక్కల దాడిలో గొర్రెల మృతి



మోపాల్: మండలంలోని శ్రీరామ్‌నగర్ తండా గ్రామపంచాయతీ పరిధిలో శివలాల్ హున్యా నాయక్ తండాలోని రాంచందర్‌కు చెందిన గొర్రెల మందపై శనివారం రాత్రి కుక్కలు దాడి చేశాయి. ఈ దాడిలో మూడు గొర్రెలు చనిపోగా, మరికొన్ని గాయపడ్డాయి. కుక్కలను అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

యువకుడి ఆత్మహత్య

రామారెడ్డి: వాహనం ఇన్సూరెన్స్ కట్టడానికి తల్లిని డబ్బు అడిగితే ఆమె ఇవ్వకపోవడంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన రామారెడ్డి మండలంలోని రెడ్డిపేట గ్రామంలో జరిగింది. ఎస్సై అనిల్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చెట్టుపల్లి రాజశేఖర్(26) టాటా ఎస్ వాహనం నడుపుతూ జీవిస్తున్నాడు. ఆ వాహనానికి ఇన్సూరెన్స్ చేయించడానికి బంగారం అమ్మి డబ్బు ఇవ్వాలని తల్లిని అడిగాడు. దీనికి ఆమె ఒప్పుకోకపోవడంతో గొడవ పడి ఆదివారం ఉదయం ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. గ్రామంలోని దామర చెరువు దగ్గర చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి లక్ష్మీనర్సవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రెండు బైకులు ఢీ : ఇద్దరికి గాయాలు

ఎల్లారెడ్డి: పట్టణంలోని పెద్ద చెరువు కట్టపై రెండు బైకులు ఢీకొనడంతో ఇద్దరికి గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. మండలంలోని సాతెల్లికి చెందిన గణేష్, నాగిరెడ్డిపేట మండలం బంజారాతండాకు చెందిన దేవిసింగ్ ఎదురెదురుగా బైక్‌పై ఢీకొట్టుకోవడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. క్షతగాత్రులున 108లో ఎల్లారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



రామారెడ్డి: మండలంలోని మద్దికుంట గ్రామంలో తాళం వేసిన ఓ ఇంట్లో చోరీ జరిగింది. ఎస్సై అనిల్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన ఓరుగంటి స్వప్న ఈనెల 24న ఇంటికి తాళం వేసి కామారెడ్డికి పని నిమిత్తం వెళ్లింది. ఆదివారం ఇంటి తలుపులు తెరిచి ఉండటంతో స్థానికులు స్వప్నకు ఫోన్ చేసి చెప్పారు. ఆమె ఇంటికి వచ్చి చూసే సరికి బీరువాలో ఉన్న అర్ధ తులం బంగారు ఆభరణాలు చోరీ అయ్యాయి. ఈ మేరకు స్వప్న పోలీసులకు ఫిర్యాదు చేసింది.

కామారెడ్డి క్రైం: కామారెడ్డి మండలం లింగాపూర్ గ్రామంలో ఆదివారం చోరీ జరిగింది. గ్రామానికి చెందిన మధునాల రాజాగౌడ్ కుటుంబం ఆదివారం ఉదయం మొక్కు తీర్చుకునేందుకు ఇంటికి తాళం వేసి సదాశివనగర్ సమీపంలోని దర్గాకు వెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చి చూసేసరికి దొంగలు పడినట్లుగా గుర్తించారు. బీరువాలో దాచి ఉంచిన రూ 9,500 చోరీకి గురైనట్లు బాధితులు చెబుతున్నారు. దేవునిపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిబంధనల ప్రకారం క్రీడలు


మాట్లాడుతున్న తెలంగాణ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఊషిరెడ్డి

ఆర్మూర్‌టౌన్: అమెచూర్ ఫెడరేషన్ కబడ్డీ ఆఫ్ ఇండియా నియమ నిబంధనలకు కట్టుబడి రాష్ట్ర కబడ్డీ క్రీడోత్సవాలు నిర్వహించాలని రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి ఊషిరెడ్డి అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని బాలాజీ ఫంక్షన్ హాల్‌లో జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో అమెచూర్ కబడ్డీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అనుబంధంగా ఉన్న రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. అమెచూర్ కబడ్డీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాకు అనుబంధంగా తెలంగాణ కబడ్డీ అసోసియేషన్‌కు అనుమతి ఉందన్నారు. త్వరలో రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినిత పవన్ మాట్లాడుతూ.. ఆర్మూర్ క్రీడలకు అడ్డాగా మారిందన్నారు. ఎంతో మంది క్రీడకారులు ఉన్నత స్థానాల్లో ఉన్నారని గుర్తుచేశారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ఎంతో ముఖ్యమన్నారు. అనంతరం తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఊషిరెడ్డిని ఘనంగా సత్కారించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్‌మున్ను, బాబన్న, గంగమోహన్ చక్రు, మోహన్‌దాస్, గంగాధర్, గంగారం, నాగభూషణ్, రాజేశ్వర్, నాగమని, దేవాసుకన్య, నరేష్ పాల్గొన్నారు.